227వ అధ్యాయం

٢٢٧ - بَابُ فَضْلِ صَوْمِ يَوْمِ عَرَفَةَ وَعَاشُورَاءَ وَتَاسُوعَاءَ

అరఫా రోజు మరియు ముహర్రమ్ మాసపు తొమ్మిదో, పదో తేదీల్లో పాటించబడే ఉపవాసాల ఘనత

١٢٥١ - عَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: سُئِلَ رسولُ اللهِ ﷺ عَنْ صَوْمِ يَوْمِ عَرَفَةَ؛ قَالَ: «يكفِّرُ السَّنَةَ المَاضِيَةَ وَالبَاقِيَةَ» رواه مسلمٌ.

1251. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)ను అరఫా నాటి ఉపవాసం గురించి విచారించటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, "అది క్రితం యేడు మరియు వచ్చేయేటి పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది" అని వివరించారు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)

ముఖ్యాంశాలు

జుల్‌హిజ్జా మాసపు తొమ్మిదో తేదీని 'అరఫా రోజు' అని పిలుస్తారు. ఆ రోజు హజ్ యాత్రికులందరూ అరఫాత్ మైదానంలో ఆగుతారు, కనుక ఆ రోజును 'అరఫాత్ రోజు'గా వ్యవహరిస్తారు. ఆ విధంగా అరఫాత్ మైదానంలో ఆగటమనేది హజ్ విధులన్నిటిలోనూ అత్యంత ప్రధానమైనది. దాన్ని నిర్వర్తించకపోతే హజే నెరవేరదు. హజ్ యాత్రికులు ఆ రోజున ప్రార్థనలు, సంకీర్తనల్లో నిమగ్నులై ఉంటారు. ఆనాడు వారికి అదే గొప్ప ఆరాధనగా పరిగణించబడుతుంది. కనుక వారు ఆ రోజు ఉపవాసం పాటించటం అభిలషణీయం కాదు. కాని హజ్ యాత్రలో పాల్గొనని వారికి మాత్రం ఆ రోజు ఉపవాసం పాటిస్తే గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. ఆ ఒక్క ఉపవాసం రెండేళ్ల పాపాలను తుడిచిపెట్టేస్తుంది.

١٢٥٢ - وعَنِ ابنِ عباسٍ رضيَ اللهُ عنهما، أَنَّ رسولَ اللهِ ﷺ صَامَ يَوْمَ عَاشُورَاءَ، وَأَمَرَ بِصِيَامِهِ. متفقٌ عليهِ.

1252. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఆషూరా రోజు (అంటే ముహర్రమ్ నెల

పదో తేదీన) స్వయంగా ఉపవాసం ఉన్నారు. ఆ రోజు ఉపవాసం పాటించమని (తన సహచరుల్ని) ఆదేశించారు కూడా. (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని ఉపవాస ప్రకరణం -సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)

ముఖ్యాంశాలు

ముహర్రమ్ పదో తేదీని 'ఆషూరా' అని పిలుస్తారు. ఇతర హదీసుల ద్వారా తెలిసేదేమంటే, దైవప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వలసవచ్చినప్పుడు మదీనాలోని యూదులు ముహర్రమ్ మాసపు పదో తేదీన ఉపవాసం పాటించటాన్ని ఆయన గమనించారు. వారిని ఉద్దేశ్యించి, "మీరు ఈ రోజు ఉపవాసం ఎందుకు పాటిస్తారు?" అని అడిగారు. దానికి యూదులు, "దేవుడు ఈ రోజు మూసా ప్రవక్తకు ఫిరౌన్ ఆగడాల నుండి విముక్తినొసగాడు. ఆ సంతోషఘడియల్ని పురస్కరించుకుని మేము ఈ రోజు ఉపవాసం పాటిస్తాం" అని చెప్పారు. అది విని దైవప్రవక్త (సల్లం) "మూసా ప్రవక్త సంతోషంలో పాలుపంచుకోవటానికి మీకంటే మేము ఎక్కువ హక్కుదారులం" అంటూ ఆయన కూడా ఆ రోజు ఉపవాసం పాటించారు. అంతేకాదు, వచ్చే ఏడాది గనక బ్రతికుంటే యూదులకు వ్యతిరేకంగా తాను పదో తేదీతోపాటు తొమ్మిదో తేదీన కూడా ఉపవాసం పాటిస్తానని ప్రకటించారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఆయన తన సహచరులకు 'మీరు ఆషూరా రోజుతోపాటు తొమ్మిదో తేదీ లేక పదకొండో తేదీన కూడా ఉపవాసం పాటించండి. ఆ విధంగా రెండు రోజులు ఉపవాసం పాటించి యూదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించండి' అని బోధించారు. కనుక ముహర్రమ్ మాసపు 9, 10, 11 తేదీల్లో ఉపవాసం పాటించటం మస్నూన్ (సంప్రదాయం). కాని శోచనీయమైన విషయం ఏమిటంటే నేడు ముస్లింలు ఈ సంప్రదాయాన్నయితే ఆచరించరు; పైగా దాని స్థానంలో అనేక దురాచారాలను నిర్వహిస్తారు. లేదంటే షియాలు జరిపే ప్రత్యేక సంతాప ఊరేగింపుల్లో పాల్గొంటారు. నిజం చెప్పాలంటే అలాంటి ఊరేగింపుల్లో పాల్గొనటం మహాపాపం.

١٢٥٣ ـ وعنْ أَبي قَتَادَةَ رَضِيَ اللهُ عَنْهُ، أَنَّ رسولَ اللهِ ﷺ سُئِلَ عَنْ صِيَامِ يَوْمِ عَاشُورَاءَ، فَقَالَ: «يُكَفِّرُ السَّنَةَ المَاضِيَةَ». رواهُ مُسْلِمٌ.

1253. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)ను ఆషూరా నాటి ఉపవాసం గురించి విచారించటం జరిగింది. అందుకాయన సమాధాన మిస్తూ, "అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది" అని చెప్పారు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)

١٢٥٤ ـ وعَنِ ابنِ عَبَّاس رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَئِنْ بَقِيتُ إِلى قَابِلٍ لأَصُومَنَّ التَّاسِعَ» رواهُ مُسْلِمٌ.

1254. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఒకవేళ నేను వచ్చే సంవత్సరం వరకు బ్రతికుంటే ముహర్రమ్ మాసపు (పదో తేదీతో పాటు) తొమ్మిదో తేదీన కూడా ఉపవాసం పాటిస్తాను. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)

ముఖ్యాంశాలు

కొంతమంది ఈ హదీసును "నేను కేవలం తొమ్మిదో తేదీన మాత్రమే ఉపవాసం పాటిస్తాను" అనే అర్థంలో వివరించారు. కాని ఈ వివరణ సరయినది కాదు. ఇతర హదీసులు ఈ వివరణను త్రోసిపుచ్చుతున్నాయి. దైవప్రవక్త (సల్లం) యూదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో ముహర్రమ్ మాసపు పదో తేదీతోపాటు తొమ్మిదో తేదీన కూడా ఉపవాసం పాటిస్తానని నిశ్చయించుకున్నారు. అంతేకాదు, తన సహచరుల్ని కూడా అలా చేయమని ఆదేశించారు. ముస్నదె అహ్మద్ గ్రంథంలో దీని ప్రస్తావన ఉంది. ఈ విషయాన్ని మేము ఇంతకు ముందు ముఖ్యాంశాల్లో కూడా వివరించాం. అందుకే హదీసు మూలాన్ని కూడా ఆ భావానికి అనుగుణంగా అనువదించాం.